


# మోహిత

## నవలారాణి నవలల నేపథ్యం



ఈ నవల విడుదల అయినతర్వాత - 'మోహిత' పేరు (హీరోయిన్ పేరు) బాగుందని చాలామంది అన్నారు. ఈ పేరు నాకు ఎప్పుడు దొరికిందో నేను మర్చిపోయాను. నవలకి ఇతివృత్తం ఒక పట్టు అయితే, ఆ నవలకి పేరు పెట్టటం అది సూటిగా, ఆకర్షణీయంగా, ఉండి చదువరులకి కుతూహలం రేకెత్తించే విధంగా ఉండటం మరొక ఎత్తు. రచయిత నవల పేరుతోనే పాఠకుల మనసు మీద సగం పట్టు సాధించాలి అని నేను నమ్ముతాను. నవల పేరుకి - నవల ఇతివృత్తానికి దూరం ఉంటే ఆ నవల ఫెయిల్యూర్ అవుతుంది. పేరుతో వచ్చిన కుతూహలంతో, పాఠకులు పుస్తకం కొనుక్కుని, కథలోకి తొంగి చూసినప్పుడు ఆ వ్యక్తి మనసు, చుట్టుప్రక్కల ప్రపంచంలో ఏం జరుగుతుందో పట్టనంత మైమరుపు తెప్పించి ఆ లోకంలోకి పరుగెత్తించాలి. నవల పూర్తయిన తరువాత కష్టంగా ఈ లోకంలోకి రావాలి. నవలలో పాత్రలు సన్నివేశాలు పాఠకుని మనసుని మంచి గంధపు పరిమళంలా ఆవరించాలి.




చాలా వరకు నేను నవలల పేర్లని సునాయాసంగానే పెట్టాను. పేరుతో ఇతివృత్తానికి సంబంధీకరణని మాత్రం పట్టువదలకుండా బాగా జాగ్రత్త పడేదాన్ని. నేను నా నవలని సృష్టించే రచయిత్రినే కాదు, నా నవలకి నేనే మొదటి పాఠకురాలిని, మొట్టమొదటి విమర్శకురాలిని కూడా. పాఠకురాలు, విమర్శకురాలు ఈ ఇద్దరు వ్యక్తులూ నాకు తోడుగా వుండటంతో, నాలో రచయిత్రి ఎప్పుడూ పాఠకురాలి అభిమానం పొందడానికి, విమర్శకురాలి సునిశిత విమర్శ తట్టుకోవటానికి సదా అప్రమత్తంగా ఉండేది. అందుకే నవలని నేను ఒకేసారి వ్రాసినా, మళ్ళీ దాన్ని చూడకుండా పబ్లిషర్‌కి ఇచ్చేసినా, వారు అది చూడకుండా ప్రింటింగుకి ఇచ్చేసి, పుస్తకంగా నేరుగా పాఠకుల చేతుల్లోకి వెళ్ళిపోయినా, నాకెలాంటి విమర్శా ఎదురయ్యేది కాదు.

మోహిత నవలలో కారెక్టర్ కాంప్లెక్స్ ప్రధాన సూత్రం. హీరో చిన్నప్పుడు దూరమైన ప్రియతమ వ్యక్తికోసం మనసంతా కన్నులు చేసుకున్నట్టు జీవితంలో వెతుకుతుంటాడు. ఈ అమ్మాయి పేరు అన్నూ. అన్నూ అతని ప్రాణం. పెళ్ళి చేసుకోకూడదనే అనుకుంటాడు. అనుకోని పరిస్థితుల్లో మోహిత అతని జీవితంలోకి

వస్తుంది. అతని కాంప్లెక్స్ ఆమె తెలుసుకుంటుంది. అన్నూ అతని బాల్యంలో జరిగిన ఒక అనుభవపు నీడ మాత్రమే అనుకుంటుంది. అతన్ని ఇష్టపడుతుంది. ప్రేమిస్తుంది. పెళ్ళిచేసుకుంటుంది. తరుణ్‌కి మోహిత అంటే ఇష్టమే. అన్నూ గురించి కావాల్సినంతగా మోహితతో మాట్లాడగలడు.

ఈ నవలలో మోహిత - తరుణ్‌లతో పాటు అన్నూ కూడా ఆద్యంతం కథలో ఉంటుంది కానీ ఆమె ఎప్పుడూ కన్పించదు. రాను, రాను, రాను మోహిత తను అన్నూ విషయంలో తక్కువ అంచనా వేసానని, తరుణ్ మనసులో ఆమె స్థానం చెక్కు చెదరనిది అని అర్థం చేసుకుంటుంది. తన ఓటమిని బలవంతంగా అంగీకరిస్తుంది. అతనికి దూరంగా వెళ్ళిపోతుంది. తరుణ్‌ని ఎంతగా ప్రేమిస్తుందంటే అతను లేని జీవితం దుర్భరం అనిపిస్తుంది. ఇది తరుణ్ తనని వంచించటం కాదు. తన ప్రేమే తనని మోసం చేసిందని భావిస్తుంది. జీవితంలో వెనక్కి తిరిగి వెళ్ళలేనంత దూరం వచ్చేసినట్టు అనిపిస్తుంది. ఈ బలమైన ఫీలింగ్‌ని నేను చాలా మంది ఆడపిల్లల్లో చూసాను. ఒకసారి ఆడపిల్ల, పెళ్ళికి గానీ, ప్రేమకి గానీ కమిట్ అయితే, ఏకాగ్రతతో చాలా దూరం నడిచేస్తుంది. ఎక్కడో మధ్యలో తను కోరుకున్నవారికి తన అవసరం లేదని - వారు తనని వదిలేస్తున్నారని అర్థం చేసుకుని తల్లడిల్లిపోతుంది. వెనక్కి వెళ్ళే మార్గం ఉండదు. అంటే దాని అర్థం అన్ని సంవత్సరాలు తను పడిన శ్రమ, చూపిన ఏకాగ్రత కాలం ఒడిలోకి ఒలికిపోయినాయి. అవి తిరిగి తన ఒడిలోకి తీసుకోలేదు. పెళ్ళి అయిన స్త్రీలు పెళ్ళి పేరిట వంచించ పడ్డవారు, ప్రేమలో ఓడిపోయినవారు అందరూ ఇదే మాట. 'నేను వెనక్కి వెళ్ళలేను.' 'ఈ ప్రేమ - పెళ్ళి - ఈ బంధాలు నాకసలు అవసరం లేదు నామనసంతా విషాదం నిజమే.. ఎలాటి భావనాలేని స్వేచ్ఛాస్వాతంత్రపు సంతోషం నాకు కావాలి'. ఇదే చాలా మంది మనసుల్లో మూగ భావన. వీరిలోని ఈ భావనలే మోహిత నవలలోని ఇతివృత్తం.

నవల్లో చాలా బాధలు - ఎడబాట్లు వున్నా - పాఠకులకి నా మీద గాఢ నమ్మకం. జీవితంలో కష్టాలకి ఒక ముగింపు వుంటుంది. చీకటి తెరలు తొలగి సంతోషపు వెలుతురు ప్రకాశిస్తుంది. కష్టాలు ఒక గతం మాత్రమే. ఓర్చుకోవాలి! ఓర్చుకుంటే ఆనందం మన సొంతం అవుతుంది. ఈ మెసేజ్ నా నవలల్లో వారికి తప్పకుండా దొరుకుతుందని వారి నమ్మకం. నేను కూడా వారి నమ్మకాన్ని వమ్ము చేయను.

ఓర్మి వుంటే జీవితంలో తప్పకుండా, మన కష్టం యొక్క మూల్యం మనకి దక్కుతుందని నాకు కూడా గాఢ నమ్మకం.

తరుణ్ అన్నూ కోసం తీవ్రంగా వెతుకుతాడు. వెనకటిలా తన కోసం కాదు. ఇప్పుడు తన స్వేచ్ఛకోసం! అన్నూ కనిపిస్తే ఆమెకి ఏంకావాలో అది తను ఇస్తే - తన మనసు స్వేచ్ఛ పొందుతుంది. బంధనాలు లేని పరిపూర్ణమైన మనసుతో, తను వెళ్ళి మోహిత ముందు ప్రేమికుడిగా మోకరిల్లితే - మోహిత తప్పకుండా తనని స్వీకరిస్తుంది. మోహిత లేకుండా తను బ్రతకలేడని అతనికి అర్థం అయింది. మోహిత తన ఊపిరి.

నవల చివరలో చిన్న ఛమక్! తరుణ్ ఇన్నాళ్ళూ మనసంతా కన్నులు చేసుకుని వెతుకుతున్న అన్నూ అతనికి లభించింది. ఆమె ఎవరో కాదు మోహిత! చిన్నప్పుడు అన్నూ అనే అనాథ బాలికని పిల్లలు లేని మోహిత తలిదండ్రులు దగ్గరకి తీసి 'మోహిత' అని పేరు పెట్టి ప్రేమతో పెంచి పెద్ద చేసారు. మోహితకిది తెలియదు.తరుణ్ అన్నూ కోసం వెతుక్కుంటూ వెళ్ళిన ప్రయాణం మోహిత ఇంటి తలుపులు తట్టి 'అన్నూ'యే మోహిత అని తెలుసుకోవటంతో కథ సుఖాంతం అవుతుంది.

WWW.IWOMAN.IN

ORDINARY WOMAN EXTRAORDINARY POWER

శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి గారు YSSR ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సేవా సంస్థని స్థాపించి అనేక సామాజిక సేవా కార్యక్రమాలని నిర్వహిస్తున్నారు. హైదరాబాదులోనీ, ప్రపంచవ్యాప్తంగానూ వున్న అనేకమంది ప్రముఖులు ఈ సంస్థ సేవాకార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నారు. ఈ సంస్థ తరఫున వీధి బాలలసంక్షేమ కార్యక్రమాలూ, వృద్ధుల సంక్షేమకార్యక్రమాలూ, అంగవికలులకు వైద్య సదుపాయాలూ, స్వయం ఉపాధి పథకాల రూపకల్పన, వాటిని అమలుచేయడం లాంటి అనేక కార్యక్రమాలని స్వచ్ఛందంగా నిర్వహిస్తున్నారు. ఈ సంస్థ కార్యక్రమాల వివరాలకోసం, సేవాకార్యక్రమాల సమగ్రసమాచారంకోసం HTTP://WWW.IWOMAN.IN *(CLICK HERE TO GO THERE)* వెబ్ సైట్‌ని సందర్శించండి. ఈ సంస్థ సేవాకార్యక్రమాల్లో పాల్గొనదలచిన వారు 'కౌముది' ని కానీ, నేరుగా శ్రీమతి యద్దనపూడి గారిని కానీ సంప్రదించ వలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం

ఎడిటర్

కౌముది